తీరనున్న ప్రయాణ కష్టాలు

- భైంసా–కామోల్ రోడ్డుకు రూ.99 లక్షలు మంజూరు
- త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



భైంసా- ఖథ్గాం మధ్య కంకరతేలిన రోడ్డు



ఖథ్గాం- కామోల్ గ్రామాల మధ్యలో మట్టి రోడ్డు

భైంసారూరల్: భైంసా నుంచి ఖత్గాం మీదుగా కామోల్ వరకు ఐదు కిలోమీటర్ల మేర నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.99లక్షలు మంజూరు చేసింది. దీంతో తమ కష్టాలు దూరం అవుతాయని సమీప గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో కొట్టుకుపోయిన రోడ్డు..

ఐదేళ్ల కిందట ఇదే మార్గంలో అక్కడక్కడా కల్వర్టులు, బ్రిడ్జిలు నిర్మించారు.. కిలోమీటర్ మేర (ఖథ్గాం నుంచి కామోల్ వరకు) రోడ్డు నిర్మించారు. మిగతా నాలుగు కిలోమీటర్లు కంకర పోసి వదిలేశారు. రెండు నెలల కిందట కురిసిన భారీ వర్షాలతో ఈ రోడ్డు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. భారీగా గుంతలు ఏర్పడ్డాయి. అక్కడక్కడా రోడ్డు సైతం కొట్టుకుపోయింది.

భైంసా, లోకేశ్వరం మండలాలను కలిపేలా..

ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే భైంసా, లోకేశ్వరం మండలాలకు మేలు జరుగుతుంది. ముఖ్యంగా లోకేశ్వరం మండలవాసులకు ఏడు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కామోల్ గ్రామం నుంచి వాగుపై ఉన్న వంతెన దాటి మట్టి రోడ్డుపై నుంచే లోకేశ్వరం మండల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. బీటీ రోడ్డు పూర్తయితే కార్లు, ప్రైవేటువాహనాలు, రైతులు తమ పంటలను ఈ మార్గం గుండానే భైంసాకు తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

తీరనున్న సమస్య..

భైంసా నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ఖథ్గాం గ్రామస్తులు బీటీ రోడ్డు కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. పట్టణానికి కూతవేటు దూరంలోనే ఉన్న ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులంతా రోజు మట్టి రోడ్డుపై కాలినడకనే భైంసాకు వస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే ఆటోలు గ్రామం వరకు వెళ్తాయి.

త్వరలోనే రోడ్డు నిర్మాణం

ఖథ్గాంలో ఇటీవల జీపీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్.. రూ.99 లక్షలతో బీటీ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామస్తుల ఇబ్బందులు తీరుతాయి.

– రాజు, సర్పంచ్, ఖథ్గాం

నిధులు మంజూరయ్యాయి

గతంలో భైంసా నుంచి ఖథ్గాం మీదుగా కామోల్ వరకు రోడ్డు నిర్మించాం. అక్కడక్కడా కల్వర్టులు.. కామోల్ వైపు నుంచి కొంతమేర బీటీ రోడ్డు కూడా నిర్మించాం. ప్రభుత్వం ఇటీవల భైంసా–కామోల్ రోడ్డుకు రూ.99లక్షలు మంజూరు చేసింది. త్వరలో పనులు చేపడుతాం.

– ఉదయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ

క్లుప్తంగా

రూ.5,00,116 విలువైన నోట్లతో అలంకరణ



లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో శుక్రవారం దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. గ్రామానికే చెందిన వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి సొంతంగా రూ.5,00,116 (ఐదు లక్షల విలువైన నోట్ల)ను హారాలుగా మార్చి అమ్మవారికి అలంకరించారు. సహస్ర దీపారాధన నిర్వహించగా స్వాములు మొక్కులు తీర్చుకున్నారు. పంచగుడిలో దుర్గాదేవి మండపం వద్ద హోమం నిర్వహించారు.

ఘనంగా చండీహోమం

ఖానాపూర్: మూలనక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీముత్యాల పోచమ్మ ఆలయ ఆవరణలో జననీఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చండీహోమం, అన్నదానం నిర్వహించారు. అర్చకులు శరత్‌చంద్రశర్మ, సందీప్‌శర్మ, ప్రవీణ్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సభ్యులు తోట సుమిత్, వెంకట్ మహేంద్ర, శ్రీనివాస్, లక్ష్మి నర్సయ్య, సత్యం, రవి తదితరులున్నారు.

'వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి'

ఖానాపూర్: వడ్డెర కులస్తులను ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చి.. వడ్డెరబంధు ప్రకటించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాతఎల్లాపూర్ పంచాయతీ పరిధిలో ఒడ్డెవాడలో వడ్డెరలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కల గంగాధర్, ఉపసర్పంచ్ ధర్మపురి, పాపన్న, వెంకటేశ్, పీటర్, బక్కన్న, ఎల్లయ్య, చిన్నయ్య, నాగన్న, రమేశ్ తదితరులున్నారు.

'నిర్మల్ క్లబ్‌పై చర్య తీసుకోవాలి'

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని నిర్మల్ క్లబ్‌లో అక్రమంగా పేకాట నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్య తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు మున్నూరుకాపు సంఘం మాజీ అధ్యక్షుడు అడప పోశెట్టి శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోశెట్టి మాట్లాడుతూ.. క్లబ్‌లో ప్రతీరోజు పేకాట ఆడి నష్టపోతున్నారన్నారు. జూదంతోపాటు మద్యం విక్రయిస్తున్నట్లు తెలిపారు. వెంటనే క్లబ్ నిర్వాహకులపై చర్య తీసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

లోకేశ్వరం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బూత్‌గదులకు వెళ్లేలా ర్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీడీవో సోలమాన్ రాజ్, బాలకిషన్, ఈసీ అనిల్ ఉన్నారు.

బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

భైంసాటౌన్: పట్టణంలోని ఖత్గాం రోడ్డులో లింగాయత్‌ల ఆరాధ్యదైవం బసవేశ్వర మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్, పారిశ్రామికవేత్త నాగనాథ్ పటేల్ హాజరయ్యారు. అనంతరం లింగాయత్ సమాజ జెండా ఆవిష్కరించారు. లింగాయత్ సంఘం పట్టణ అధ్యక్షుడు యోగేశ్ పటేల్, నాగభూషణ్, సభ్యులు పాల్గొన్నారు.

అడెల్లిలో గర్భగుడి ద్వారం ఏర్పాటుకు పూజలు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన అడెల్లి ఆలయంలో గర్భగుడి ప్రధాన ద్వారానికి గడప ఏర్పాటుకు శుక్రవారం ఆలయ ఈఓ రవికిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంట్రాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, స్థానిక ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రధాన ద్వారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, పలువురు సిబ్బంది ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో ప్రారంభించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి కింద రూ.ఆరు వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.3 వేల చొప్పున బహుమతులను సర్పంచ్ సంగెం నర్సన్న అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు ముత్యంరెడ్డి, సాయారెడ్డి ఉన్నారు.

బూత్ అధ్యక్షులు సైనికుల్లా పనిచేయాలి

- కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్
- ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నేతలకు సూచన



కడెం: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్

కడెం: కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా బూత్ అధ్యక్షులు సైనికుల్లా పనిచేయాలని కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్సీ, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రకాశ్ రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడెంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులకు పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలో బూత్ అధ్యక్షుడు కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వివరించాలని సూచించారు. పార్టీ బలం తెలుసుకునేందుకు ఏఐసీసీ వార్ రూం నుంచి బూత్ అధ్యక్షులకు ఫోన్ కాల్స్ వస్తాయని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, రాంకిషన్‌నాయక్, అడ్వకేట్ మల్లారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, మండలాధ్యక్షుడు మల్లేశ్, కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సత్తెన్న, వాజిద్‌ఖాన్, భూషణం తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభం

దస్తురాబాద్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని దేవునిగూడెం, భూత్కూర్ గ్రామాల యువకులు, బుట్టపూర్ ఉపసర్పంచ్ సుమలత, వార్డు సభ్యుడు రాజేశ్ కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, యువజన కాంగ్రెస్ నాయకులు సతీశ్‌రెడ్డి, గుండా నరేష్, కిషన్, భూమన్న రమేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు మాజీ ఎంపీపీ రాజీనామా



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ అరుణ

కుంటాల: బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం కుంటాల మాజీ ఎంపీపీ అరుణ రమణారావు ప్రకటించారు. ఈసందర్భంగా వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 15 ఏళ్లుగా దివంగత మాజీ మంత్రి గడ్డెన్న ఆశయ సాధనకు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గెలుపునకు అహర్నిశలు కృషి చేసినా తమను చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా లేఖను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు పంపినట్లు తెలిపారు. త్వరలో ఏయే పార్టీలో చేరేది స్పష్టం చేస్తామని పేర్కొన్నారు. వార్డు మాజీ సభ్యులు మేసినేని వెంగళరావు సైతం రాజీనామా చేశారు. రమేశ్‌గౌడ్, రాజు, రమేశ్, ప్రవీణ్, శ్రీనివాస్, గజేందర్, దత్తు, సురేశ్ పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పెంబి: పండుగల వేళ గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. సద్దుల బతుకమ్మ, దసరా, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఖానాపూర్ సీఐ మోహన్, పెంబి ఎస్సై రజినీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని మందపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతేడాది దసరా ఉత్సవాల్లో మందపల్లిలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి కేసులు నమోదైన విషయం తెలిసినదే. దీనిని దృష్టిలో ఉంచుకొని గొడవలు తలెత్తకుండా చూడాలని గ్రామపెద్దలు, సర్పంచ్‌లకు సూచించారు. అనంతరం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సర్పంచ్ సుధాకర్, వీడీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

'బీఆర్ఎస్‌కే ఓటేసి గెలిపించాలి'



ఖానాపూర్: ప్రచారం చేస్తున్న జాన్సన్‌నాయక్

కడెం: అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎలగడప, మద్దిపడగ, దిల్దార్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద పూజలు చేశారు. కారుకు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని గోసంపల్లె గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకముందు పట్టణంలోని వాసవిమాత ఆలయంలో పూజలు చేసి పద్మావతినగర్‌లోని ఏకలవ్య వాడలో పర్యటించారు. వారి వెంట లోకిని జూని, గంగారాం, ధర్మరాజు, శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, నారాయణ, మధు, కైలాస్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే సంక్షేమ ఫలాలు



పార్టీలో చేరిన వారితో పురాణం సతీశ్‌కుమార్, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి పురాణం సతీశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఖత్గాం రోడ్డులో శుక్రవారం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం నర్సాపూర్(జి) మండలానికి చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

గిరిజన గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం

సారంగపూర్: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహవీర్‌తండా, దుర్గానగర్, సేవానగర్, హనుమాన్‌తండా, లక్ష్మీనగర్, బోరింగ్‌తండా, సారంగాపూర్‌లోని దేవితండాల్లో ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ పథకాలను వివరించారు. వారి వెంట ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాధవరావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ ముదిరాజ్ సంఘ భవనంలో బీఆర్ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి శుక్రవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించుకొని పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, శ్రీనివాస్ ఉన్నారు.

శోభాయమానంగా నవరాత్రి ఉత్సవాలు



జిల్లా కేంద్రంలో మహిళల కుంకుమపూజలు



ఖానాపూర్: శివాజీనగర్‌లో భక్తుల పూజలు



నిర్మల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లావ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మార్గ్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపం వద్ద అమ్మవారికి గాజులు, కుంకుమపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు, పిల్లలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి శివరాం వెంకటేశ్, సహాధ్యక్షులు కాసా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు లింగంపల్లి లక్ష్మీనారాయణ, సదయ్య, రవీంద్రనాథ్, వెంకటరమణ, నివేదిత లక్ష్మి, సునీత పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్, శివాజీనగర్, అంబేద్కర్‌నగర్, ఇంద్రానగర్, పద్మావతినగర్ తదితర కాలనీలతోపాటు మండలంలోని సత్తన్‌పల్లి, పాతఎల్లాపూర్ హిందువాహిని యూత్, గోసంపల్లె, నడింపల్లె, తదితర గ్రామాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమపూజలతోపాటు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె)లో దుర్గాదేవి మండపం వద్ద యజ్ఞం నిర్వహించారు. పలు గ్రామాల్లో అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా సుమంగళి పూజ

నిర్మల్‌టౌన్: శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా సుమంగళి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మూల నక్షత్ర శుభముహూర్తాన ఉదయం 10 గంటల నుంచి అమ్మవారికి విశేష కుంకుమార్చన, అష్టోత్తర, లలిత సహస్ర నామాలు, 11వేల గాజుల పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలకు గాజులు అమ్మవారి ప్రసాదంగా అందించారు.

ఈరోజు

విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని ఆదర్శనగర్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శనగర్, రామ్‌నగర్, ఈద్గామ్, సోఫీనగర్, సిద్దాపూర్, గాయత్రీపురం, ఇందిరమ్మ కాలనీల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదానానికి ముందుకురావాలి

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో శనివారం రక్తదానం చేసేందుకు యువకులు ముందుకు రావాలని ఎస్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న ఉదయం ఎనిమిది గంటలకు శిబిరం నిర్వహిస్తున్నామని.. ఆసక్తి కల్గినవారు 87126 59521నంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మైనార్టీలను మోసం చేసిన కేసీఆర్

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



ప్రచారం చేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని చెప్పి అధికారంలోకి రాగానే వారని సీఎం కేసీఆర్ మోసం చేశారని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గుల్జార్ మజీద్, చాంద్ మజీద్ వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వివరించారు. ఆయన మాట్లాడుతూ నిర్మల్‌లో హజ్ హౌస్, షాదిఖానా, కమ్యూనిటీ భవనం నిర్మిస్తానని చెప్పిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం ముస్లింలను మోసం చేశారని మండిపడ్డారు. ముస్లింలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పలువురి చేరిక..

సోన్ మండలం సాకెర గ్రామ ఉపసర్పంచ్ సతీశ్, భాగ్యనగర్ మాజీసర్పంచ్ భోజన్న, టెంబుర్ని గ్రామ బీఆర్ఎస్ నాయకులు నగేష్, గంగపుత్ర సభ్యులు పెద్దసాయన్న, శ్యాంసుందర్ శుక్రవారం నిర్మల్‌లో శ్రీహరిరావు క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఇంద్రకరణ్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రమణ, మధుకర్ రెడ్డి, రాజనరసింహారెడ్డి, పవన్, సుదర్శన్, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

మామడ: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని శ్రీహరిరావు కూతురు మాధురి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని వెంకటపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దిమ్మదుర్తి ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ హిమబిందు, భీమేశ్, వెంకటేశ్, జీవన్ పాల్గొన్నారు.

'నిర్మల్‌లో బీజేపీని గెలిపించాలి'



బీజేపీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లో బీజేపీని గెలిపించడమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జుట్టు దినేశ్, ఉత్తూరి నవీన్, గవాస్కర్ గౌతం, నాని స్వప్నిక్, కుడుకల శ్రీను, పాతర్ల సురేశ్, సందీప్‌గౌడ్‌తో పాటు వారి అనుచరులు, మామడ మండలం పరిమండల్, కిషన్‌రావ్‌పేట్ గ్రామస్తులు పలువురు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈమేరకు మహేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అయ్యన్నగారి భూమయ్య, మెడిసెమ్మరాజు, భూపతిరెడ్డి, అయ్యన్నగారి రాజేందర్, సాధం అరవింద్, వొడిసెల అర్జున్, గాదె విలాస్, కొండాజి శ్రావణ్, అల్లం భాస్కర్, రిత్విక్, మల్లేశ్, సురేశ్, శ్రీనివాస్, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్–బొప్పారం, కూచన్‌పెల్లి, సంగంపేట గ్రామాల్లోని దుర్గాదేవి మండపాల వద్ద బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రావుల రాంనాథ్ పూజలు చేశారు. వారికి గ్రామస్తులు, భవానీయూత్ సభ్యులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సంగంపేటలో భీంరావ్, ప్రశాంత్, అరుణ్, శ్రీనివాస్, రాజాగౌడ్, వేణు, అన్వేశ్, మనోజ్‌తోపాటు పలువురు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకుల్ నాగయ్య, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, సరికెల గంగన్న, సాయన్న, గంగారెడ్డి, హరీశ్‌రెడ్డి, అంకం జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహేశ్వర్‌రెడ్డి సతీమణి పూజలు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) నుంచి బీరవెల్లి వరకు ఆయా గ్రామాల్లోని దుర్గాదేవి మండపాల్లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి పూజలు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. జింక సూరి, ఆర్‌వి రమణ, విలాస్, తిరుమలచారి, శ్రీనివాస్ ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నర్సాపూర్(జి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ నుంచి బీజేపీకి మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన బీజేపీ మండలశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి నరేందర్, డాక్టర్ సాయన్న దత్తురాం, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి ఆపాలి'



నిర్మల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పాలస్తీనా(గాజా)పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడిని ప్రపంచ దేశాలు ఖండించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి కట్ల రాజన్న అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నాయకులు బక్కన్న, రామలక్ష్మణ్, ఎస్.గంగన్న, ఎండీ.గఫూర్, మహేందర్, రాజారాం పాల్గొన్నారు.

ఖానాపూర్: పాలస్తీనా(గాజా)పై ఇజ్రాయెల్ దేశం యుద్ధం ఆపాలని సీపీఐఎంఎల్(ప్రజాపంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య కోరారు. శుక్రవారం పట్టణంలోని ఐబీ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అంకుశ్‌రావు, రాజన్న, జ్యోతిరాం, మోహన్, శ్రీనివాస్, గోరెబాయ్, శంకర్, రాజన్న పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లోని నాగేష్ ఇండస్ట్రీస్‌లో శుక్రవారం(ప్రైవేటు) పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల అనంతరం పత్తి బండ్లను తూకం చేస్తూ ధర నిర్ణయించారు. క్వింటాల్‌కు రూ.7,551 చెల్లించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పత్తిని తీసుకువచ్చారు. అనంతరం రైతులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు మాజీ సర్పంచ్ చవాన్ శంకర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, విజయ్, వ్యాపారులు నాగేశ్వర్, బాలాజీ పలువురు అధికారులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

కుంటాల: మండలంలోని అర్లి(కె) 61వ జాతీయ రహదారిపై శుక్రవారం ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సూచించారు. వారి వెంట సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లె గ్రామంలో శుక్రవారం హర్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.